

కల్వర్టు లేక నానా కష్టాలు..!

భీమారం: మండలంలోని తాళ్లగూడెం సమీపంలోని వాగుపై కల్వర్టు లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ నర్సరీ వద్ద వాగుపై వంతెన నిర్మించి అనంతరం చెక్ డ్యాం నిర్మించడంతో నీరంతా దాదాపు కిలో మీటరు నిలిచి ఉంటుందని రైతులు తెలిపారు. దీంతో పొలాల వద్దకు వెళ్లేందుకు నానా పాట్లు పడాల్సి రావడంతో రైతులు అందరూ కలిసి వాగులో పైపులు వేసి తాత్కాలిక రోడ్డు నిర్మించుకున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక కల్వర్టుకు ఇరువైపులా గల రోడ్డు కోతకి గురైందని రైతులు తెలిపారు. పోలంపల్లి శివారులోని తాళ్లగూడెం పరిధిలో దాదాపు 200ఎకరాల పొలాలు సాగు చేస్తుంటామని అయితే వాగుపై కల్వర్టు లేక రాకపోకలకు ఇబ్బందిగా మారిందని రైతులు తెలిపారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకొని కల్వర్టు నిర్మించి బాధల నుంచి విముక్తి కల్గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు వేశారు.. మొరం మరిచారు!

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట అటవీ చెక్ పోస్ట్ నుంచి చింతపల్లి వరకు నూతనంగా నిర్మించిన బీటీ, సీసీ రోడ్డుకు ఇరువైపులా సమానంగా మొరం పోయలేదు. వాహనదారులు రోడ్డు దిగితే మళ్లీ రోడ్డు ఎక్కడం ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి, రోడ్డుకు సమానంగా ఇరువైపులా మొరం పోయించాలని స్థానికులు కోరుతున్నారు.





పనిచేయని ఇన్వర్టర్స్, బ్యాటరీలు

- డిజిటల్ పాఠాలకు అంతరాయం

దండేపల్లి: మనఊరు–మనబడి పథకంలో భాగంగా దండేపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణకు డిజిటల్ టీవీలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణలో విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు ఇన్వర్టర్స్ ఏర్పాటు చేశారు. ఇన్వెర్టర్స్, బ్యాటరీలు కొద్దిరోజులకే పనిచేయడం లేదు. దీంతో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న సమయంలో కరెంటు పోతే డిజిటల్ తరగతుల నిర్వహణకు అంతరాయం కలుగుతుంది. ఇన్వర్టర్స్, బ్యాటరీలు నాణ్యతగా లేకపోవడంతోనా, లేక ఏమైనా టెక్నికల్ సమస్యనో ఎవరికీ తెలియడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇన్వర్టర్స్, బ్యాటరీలు పనిచేసేలా చేసి, డిజిటల్ తరగతుల నిర్వహణకు అంతరాయం కలగకుండా చూడాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న బడిబయట పిల్లల సర్వే



సర్వే చేస్తున్న సీఆర్పీ బుచ్చన్న

జన్నారం: 0–14 సంవత్సరాల గల బడి బయట ఉన్న పిల్లల వివరాల నమోదు సర్వే జన్నారం మండలంలో కొనసాగుతుంది. మండలంలోని ఐదుగురు సీఆర్పీలు ఈ నెల 11నుంచి సర్వే ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సర్వే నిర్వహిస్తారు. బడి ఈడు ఉండి బడి బయట గల పిల్లల వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు సీఆర్పీ బుచ్చన్న తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అంగన్‌వాడీ టీచర్ల సాయంతో సర్వే కొనసాగిస్తామని, వచ్చే నెల 10తేదీ వరకు సర్వే చేయనున్నట్లు తెలిపారు.

20 నుంచి గురు చరిత్ర పారాయణం

చెన్నూర్: పట్టణంలోని శివాలయంలో ఈ నెల 20(బుధవారం) నుంచి 26మంగళవారం వరకు దత్తాత్రేయ చరిత్ర(గురు చరి త్ర) పారాయణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వేమారం మహేశ్వర్ శర్మ తెలిపారు. లోక కళ్యాణార్థం ఏటా ఆలయంలో గురుచరిత్ర పారాయణం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. చరిత్ర పారాయ ణం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు మధ్యాహ్నం 1:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వారం రోజుల పాటు గురు చరిత్ర ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న బుధవారం 10గంటలకు వ్యాస పూజ, మధ్యాహ్నం తీర్థ ప్రసాదాల వితరణ అన్నదానం ఉంటుందని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: అయ్యప్ప మండల పడి పూజా మహోత్సవాన్ని పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆ లయ ప్రాంగణం మార్మోగింది. గురుస్వామి గడ్డం రమేశ్ ఆధ్వర్యంలో దివ్య పదునెట్టాంబడి కలశ పూజ నిర్వహించగా అయ్యప్పస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం రద్దు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం రద్దు అయ్యింది. సోమవారం జరగాల్సిన మండల సమావేశం అనివార్య కారణాల వల్ల రద్దు కాగా తిరిగి నిర్వహించాల్సిన సమావేశం తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఎంపీడీఓ అబ్దుల్‌హై తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం చేయాలి

మంచిర్యాలఅర్బన్: జనవరి 18, 19న నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉప అంశాలలో ఆరోగ్య, పర్యావరణానికి జీవనశైలి, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలే కాకుండా ప్రధానాంశం అనుగుణంగా విద్యార్థులు తమ పరిసరాలలో ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

జన్నారం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేశ్, పీఆర్‌జేఈ సతీశ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

నిమోనియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని అంగ్రాజ్‌పల్లిలో సోమవారం జిల్లా వైద్యాధికారి అనిత నిమోనియా వ్యాధిపై అవగాహన కల్పించారు. 0–5 ఏళ్లలోపు పిల్లల్లో ఈ వ్యాధి సోకకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. నిమోనియా వ్యాధిన పడిన వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణతేజ, జగదీశ్, సత్తయ్య ఏఎన్‌ఎంలు ఉన్నారు.

భీమారంలో ప్రజావాణి

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అధికారులు హాజరుకాగా ప్రజలు మాత్రం రాలేదు. ఈ మేరకు ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజావాణిని ఆశ్రయించవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఊరూరా మల్లన్న బోనాలు

వేమనపల్లి: మండలంలో ఏ గ్రామంలో చూసినా సప్తి వారోత్సవాల సందడి నెలకొంది. వారం రోజులు నియమ నిష్ఠలతో మద్యం, మాంసానికి దూరంగా ఉండి పూజలు చేస్తున్నారు. మల్లన్న దేవుడికి కొత్త బియ్యం, కొత్త కుండలో పాయసం వండి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు కళాకారులు, భక్తులు మల్లన్న దేవుడికి పట్నాలు వేసి ఒగ్గే ఒగ్గే అన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం రోడ్లు, భవనాల శాఖ ఏఈ హరీశ్ పరిశీలించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకి చెందిన గడ్డం వినోద్ ఎన్నికైన సంగతి తెలిసిందే. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంకా అడుగుపెట్టలేదు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో చేపట్టాల్సిన పనులను రోడ్లు, భవనాల శాఖ ఏఈ పరిశీలించారు. ఇందుకు సంబంధించి రూ.10లక్షలతో మరమ్మతులు చేయడానికి ప్రతిపాదించినట్లు ఏఈ తెలిపారు. త్వరలోనే మరమ్మతు పనులు చేపట్టడానికి తగిన కార్యచరణను రూపొందించినట్లు పేర్కొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో, దండేపల్లిలో, హాజీపూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ప్రస్తుతం రెండు పథకాలు ప్రవేశపెట్టామని, త్వరలో మిగితా అన్ని పథకాలను ప్రవేశపెడుతామని హామీ ఇచ్చారు. రైతులకు నీటి సమస్య ఉండకుండా ఉండేందుకు యాసంగి పంట సాగుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కడెం ఆయకట్టు కింద డీ–30 నుంచి 42వరకు యాసంగి పంటకు గూడెం ఎత్తిపోతల ద్వారా సాగునీరందిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ అన్నం మంగ, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. దండేపల్లిలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, స్థానిక సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం, డీటీ విజయ, ఆర్‌ఐ భూమన్న, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు

చదువుకున్న పాఠశాలపై మమకారంతో...

లక్సెట్టిపేటలోని బాలుర ఉన్నత పాఠశాల (తను చదువుకున్న పాఠశాల) అగ్ని ప్రమాదానికి గురికావడంతో, త్వరలోనే నూతన పక్కా భవనం మంజూరుకు కృషి చేస్తానన్నారు. గదులు పరిశీలించి పాఠశాల పరిసరాలను తిరుగుతూ, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

హాజీపూర్‌లో..

ఏ నియోజకవర్గంలో లేనివిధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1కిలో కూడా ఎక్కువ తూకం వేయకుండా చర్యలు చేపట్టామన్నారు. గతంలో తూకం ఎక్కువ వేసి చేసిన మోసాలపై సీబీఐ విచారణ జరిపిస్తామన్నారు. డీసీఎంఎస్, పీఏసీఎస్‌లు తమ ధాన్యం కొనుగోలు కేంద్రాల లైసెన్స్‌లు స్వచ్ఛందంగా రద్దు చేసుకోవాలన్నారు. ఇకపై కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు చేపడుతాయన్నారు. ఎల్లంపల్లి ముంపు గ్రామాల నిర్వాసితులు రూ.70వేల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదని, సంక్రాంతి వరకు ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5లక్షలు అందజేసే కార్యక్రమం ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉంటే తనకు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలోనే ఎల్లంపల్లి లెక్కలు కూడా తేలుస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, రైతుబంధు సమితీ మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, తహశీల్దార్ సతీశ్‌కుమార్ నాయబ్ తహశీల్దార్ హరిత, గిర్దావర్‌లు ప్రభు, మంగ, సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారిగా హాజీపూర్ మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును మండల అధికారులు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్లు ప్రభు, మంగ, జూనియర్ అసిస్టెంట్ శ్రీలతతో పాటు మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, హాజీపూర్ మండల పశువైద్యాధికారిణులు సరిత, డాక్టర్ శాంతిరేఖ పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

■ బొగ్గుబాయి వార్తలు

సాంస్కృతిక ప్రదర్శనలకు ఎంపిక



నృత్యం చేస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: ఈ నెల 27న ప్రగతి మైదానంలో జరిగే సింగరేణి వేడుకల్లో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనల కోసం ఎంపిక పోటీలు జరిగాయి. సీసీసీలోని సింగరేణి ఎస్సీఓఏ క్లబ్‌లో ఈ పోటీలు జరిగాయి. సింగరేణి పాఠశాల, పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఈ ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

సేవా సమితి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



మందమర్రిరూరల్: ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏరియా సీఈఆర్ క్లబ్ ఆవరణలో సోమవారం మహిళలకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ హాజరై ప్రారంభించారు. యాజమాన్యం నిర్వహించిన త్రోబాల్, బాంబ్ బ్లాస్టింగ్, బాల్ బాస్కెట్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించే వేడుకలో ఏరియా జీఎం చేతు ల మీదుగా బహుమతులు పంపిణీ అందజేయనున్నట్లు శ్యాంసుందర్ తెలిపారు.

గనులపై ప్రచారం



జైపూర్: మండలంలోని ఇందారం ఐకే-1ఏ గనిపై హెచ్‌ఎమ్మెస్, ఐఎన్టీయూసీ సంఘాల నాయకులు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా సోమవారం ప్రచారం నిర్వహించారు. ఊసరవెల్లి సంఘాలను ఓడించి కార్మికు ల హక్కుల కోసం పోరాటం చేస్తున్న హెచ్‌ఎమ్మెస్ యూనియన్‌ను గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేణి శ్యాం మాట్లాడుతూ.. నిన్న, మొన్నటి వరకు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన టీబీజీకేఎస్‌ను విమర్శించకుండా ఏఐటీయూసీ సీపీఐ నాయకులు ఐఎన్టీయూసీని టార్గెట్ చేసి మాట్లాడడం ఎంతవరకు స మంజసమన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు.

పోలీసులు బాధితులకు భరోసానివ్వాలి

- మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్

నెన్నెల: వార్షిక తనిఖీల్లో భాగంగా నెన్నెల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ అంతా తిరిగి చూశారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన గార్డెన్‌ను ప్రారంభించారు. గార్డెన్‌లో మామిడి మొక్కను నాటి నీళ్లు పట్టారు. పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు ప్రజలతో చేరువయ్యేలా ఉండాలన్నారు. సిబ్బంది పనితీరు గురించి బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, రూరల్ సీఐ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రజా సమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీసులు భరోసా కల్పించాలన్నారు. బాధితులకు ఏదైనా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని ఆదేశించారు. బాధితులు తీసుకొచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. డయల్ 100కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేసి, ప్రతి రోజు వారిని తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట ఎస్సై శ్యాంపటేల్ ఉన్నారు.



మొక్క నాటుతున్న డీసీపీ

పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి

తాండూర్: పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. తాండూర్ సర్కిల్ కార్యాలయం, మాదారం పోలీసుస్టేషన్‌ను సోమవారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. తనిఖీ అనంతరం సీఐ, ఎస్సై, సిబ్బందితో ఏసీపీ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ.. పోలీసు కేసుల్లో పట్టుబడిన ప్రాపర్టీని కోర్టులో విధిగా డిపాజిట్ చేయాలన్నారు. ఆ కేసు క్లోజ్ అయిన తర్వాత కోర్టు అనుమతితో ప్రాపర్టీని డిస్పోజల్ చేయాలని సీఐ, ఎస్సైలను ఆదేశించారు. విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ కలిగి ఉండటంతో పాటు ఫిర్యాదుదారులతో సరిగ్గా వ్యవహరించాలని పేర్కొన్నారు. సర్కిల్, పోలీసు స్టేషన్‌లలోని రికార్డులను పరిశీలించారు. ఏ ఏ రకాల కేసులు అధికంగా నమోదు అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ వెంట తాండూర్ సీఐ కె.శ్రీనివాసరావు, తాండూర్ ఎస్సై రాజశేఖర్, మాదారం ఏఎస్సైలు హుస్సేన్, పెద్దయ్య, సిబ్బంది ఉన్నారు.

ఓటరు జాబితా సవరణలపై దృష్టిపెట్టాలి



శిక్షణ ఇస్తున్న ఎన్నికల అధికారి

భీమారం: ఓటరు జాబితాలో చేపట్టే సవరణలపై బీఎల్‌ఓలు దృష్టి పెట్టాలని తహసీల్దార్ విశ్వంబర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం బీఎల్‌ఓలకు ఓటరు జాబితాలపై ఒక రోజు నిర్వహించిన శిక్షణలో తహసీల్దార్ పాల్గొన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో మృతి చెందిన వారి పేర్లు తొలగించాలని కోరారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వంబర్

ఓటరు నమోదుపై శిక్షణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బీఎల్వోలకు ఓటరు నమోదుపై ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎల్వోలకు కొత్త ఓటరు నమోదు ఎలా చేయాలనే విషయంతో పాటు బీఎల్వోల సమస్యలకు సమాధానం తెలిపారు.

తేమ శాతం లేకుండా చూడాలి

వేమనపల్లి: కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం 17 శాతం మించి ఉండకూడదని జెడ్పీటీసీ స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్‌లు అన్నారు. సోమవారం మండలంలోని సూరారం, నాగారం, మంగెనపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేషం, సర్పంచ్ పల్లె రమేశ్ గౌడ్, పీఏసీఎస్ కార్యదర్శి మధుకర్, సెంటర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేసినట్లు హెల్ప్ సొసైటీ వ్యవస్థాపకులు సైమన్ సంతోష్ కృష్ణ తెలిపారు. ప్రతి నెలా హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు కళ్యాణ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ అంజలికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీలో మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల మహిళలు సంతోషంగా ఉన్నప్పటికీ, ఆటోడ్రైవర్లు మాత్రం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటోల్లోప్రయాణించే వారి సంఖ్య తక్కువగా ఉండడంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటోడ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్న హామీ అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి మద్దూరీ రాజు, ఆటోడ్రైవర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థినికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల రెబ్బెన గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన దివంగత కంబాల మల్లేశ్ కుమార్తె శైలజ ఇంటర్‌లో 931మార్కులతో రాణించి బీఎస్సీ నర్సింగ్ సీట్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన శైలజ బీఎస్సీ చదువుకునేలా మన ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ స్పందించి రూ.10వేల సహాయాన్ని సోమవారం చెక్కు రూపంలో ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు భూమేశ్, ఉపాధ్యక్షుడు కుమార్, సభ్యులు సంపత్, నరేశ్, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

